క్లుప్తంగా

16 నుంచి పవిత్రోత్సవాలు

తెనాలి: స్థానిక శ్రీసువర్చలాసమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు వార్షిక పవిత్రోత్సవాలు, మహా సుదర్శనహోమం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవాలయ కార్యనిర్వహణ అధికారి అవుతు శ్రీనివాసరెడ్డి ఆలయ ప్రాంగణంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు, మహా సుదర్శనహోమం, 18న పూర్ణాహుతి, తిరుప్పావడ సేవ ఉంటాయని అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, కిరణ్‌కుమార్‌లు వివరించారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, నిఖిల్ శాండిల్య, శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన సేవాసమితి సభ్యులు గుడివాడ బాలకష్ణ, మూర్తి వెంకటేశ్వరరావు, జంధ్యం రామారావు, మడుపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ బదిలీ



తెనాలి అర్బన్: తెనాలి పురపాలక సంఘం శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్ర రావు రేపల్లెకు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆదివారం తెలిసింది. ఐదు సంవత్సరాలుగా ఆయన ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర శానిటరీ ఇన్‌స్పెక్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా, ఆంధ్రా ప్యారిస్ మున్సిపల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్నారు.

బ్రాహ్మణ పరిషత్‌కు నూతన కార్యాలయం



తెనాలి: బ్రాహ్మణ పరిషత్ తెనాలి శాఖ నూతన కార్యాలయంలోకి ప్రవేశించింది. స్థానిక కొత్తపేటలోని సరోజినీ నాయుడు వీధిలో ఏర్పాటైన ఈ కార్యాలయాన్ని ఆదివారం వేదపండితుడు బ్రహ్మశ్రీ మేళ్లచెరువు చంద్రశేఖరశాస్త్రి ప్రారంభించారు. అనంతరం నూతన కార్యవర్గం సమావేశమైంది. పేద బ్రాహ్మణ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, కార్తిక వనసమారాధన అంశాలపై చర్చించారు. అధ్యక్షుడు కోటా పార్థసారథి, కార్యదర్శి చింతపల్లి సాయికిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. స్కాలర్‌షిప్ అవసరమైన వారు 94907 09864 నంబరులో సంప్రదించాలని సూచించారు. కోశాధికారి కామరాజుగడ్డ రామచంద్రమూర్తి (రాంబాబు), ఉపాధ్యక్షుడు కాజా శ్రీనివాసరావు, పులిపాక లక్ష్మణకుమార్, ధనుంజయ, సహాయ కార్యదర్శి మన్నవ మురళీమోహన్, నేతి ఆంజనేయ శాస్త్రి, గడియారం శివకుమార్, సభ్యులు కొండపి శ్రీనివాసరావు, జె ప్రవీణ్, కొణిదేన సరళ, సీహెచ్ మౌనిక పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల సొసైటీల సమావేశం



తెనాలి: ది తెనాలి పోస్టల్ ఎంప్లాయీస్ సొసైటీ, ది ఆంధ్రప్రదేశ్ సర్కిల్ పోస్టల్ ఎంప్లాయీస్ సొసైటీల సంయుక్త వార్షిక సమావేశాన్ని ఆదివారం స్థానిక కొత్తపేటలోని ఎన్జీవో కళ్యాణమండపంలో నిర్వహించారు. ఎ.పోతురాజు, కె.సాంబశివరావు సంయుక్తంగా అధ్యక్షత వహించారు. కాకతీయ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ డీఎల్ కాంతారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సొసైటీల నిర్వహణ, ఆర్థిక స్థితిగతులను చర్చించారు. రాజధాని ప్రాంతం బేతపూడిలో నూతనంగా సొసైటీ భవనం నిర్మించటానికి తీర్మానించారు. గుంటూరు పీఅండ్‌టీ కార్యదర్శి బి.సుబ్బారావు పలు సూచనలు చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలు

తెనాలి రూరల్: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. తెనాలి మార్కెట్ యార్డు వద్ద స్కూటీపై రాంగ్ రూట్‌లో వెళుతున్న ఇద్దరు అంగలకుదురు వైపు వస్తున్న బైక్‌ను ఢీ కొట్టారు. దీంతో ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. వినాయక నిమజ్జనం బందోబస్తులో ఉన్న పోలీసులు వీరిని వెంటనే తెనాలి జిల్లా వైద్యశాలకు పంపారు. మరో ఘటనలో చెంచుపేటలోని విద్యుత్ కార్యాలయం గేటు ఎదుట మరో వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. రాంగ్ రూట్‌లో రావడంతో ప్రమాదం సంభవించిందని భావిస్తున్నారు. పోలీసులు అతడిని కూడా వైద్యశాలకు పంపారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

బగళాముఖి సేవలో హైకోర్టు పీపీ

చందోలు(కర్లపాలెం): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ దంపతులు ఆదివారం చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారిని దర్శించుకున్నారు. లక్ష్మీనారాయణ దంపతులకు ఆలయ కార్యనిర్వాహణాధికారి నరసింహమూర్తి, పూజారులు వేద స్వస్తితో స్వాగతం పలికి ఆలయంలోకి తీసుకువచ్చారు. అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం వేద ఆశీర్వచనం అందించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా గణపతి ఉత్సవాలు

ఉత్సాహంగా సాగిన లడ్డూల వేలంపాటలు

తెనాలి: పట్టణ మారీస్‌పేట మఠం బజార్‌లో అభయ ఆంజనేయ యూత్ ఆధ్వర్యంలో గణేష్ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం లడ్డూ వేలంపాట జరిగింది. ప్రవాస భారతీయుడు మద్దినేని మహేష్ రూ.1,41,116 కు కైవసం చేసుకున్నారు. కమిటీ సభ్యులు మురళి, మణి, గిరిధర సాయి, లక్ష్మీ నారాయణ, సురేష్, రబ్బాని, వసంత్, సూర్య, తోట గోపి, బండారు గోపి, రాగం గోపి తదితరులు పాల్గొన్నారు.

■ స్థానిక సుల్తానాబాద్ వడ్డెర కాలనీలో వడ్డెర సమైక్య యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మందిరంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా చేశారు. ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టీడీపీ నాయకులు వీరవల్లి మురళి, అంగలకుదురు గ్రామ ఉప సర్పంచి కనగాల నాగభూషణం పాల్గొన్నారు. యూత్ సభ్యులు అనిల్, సిద్ధాంతి శ్రీనివాసరావు, వెంకట్రావు, వెంకటేష్, ఏసుబాబు, సత్యనారాయణ, శ్రీను, ఏసు, గోపి, శంకరనాయక్ తదితరులు పాల్గొన్నారు.



మఠంబజారులో రూ.1.41 లక్షలకు లడ్డూ దక్కించుకున్న మద్దినేని మహేష్

■ పట్టణ చినరావూరు రావిచెట్టు సెంటరు సోమేశ్వరాలయం వీధిలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో మహోత్సవాలు ఘనంగా జరిగాయి. నిత్యం విశేష పూజలు, అన్నసంతర్పణ చేశారు. లడ్డూ ప్రసాదాన్ని ఆదివారం వేలం వేశారు. పెద్ద లడ్డూను రూ.83 వేలకు మారావి గిరిధర్, చిన్న లడ్డూను రూ.62 వేలకు వల్లూరి చందన దక్కించుకున్నారు. వల్లూరి ప్రవీణ్, వాసిరెడ్డి చంద్రశేఖర్, మాతా ఫణీష్, మైలా శివచరణ్, బిట్రా ధనుష్ తదితరులు పాల్గొన్నారు.



చినరావూరులో లడ్డూల వేలంపాట



తెనాలి సుల్తానాబాద్‌లో వేడుకల్లో భక్తులు

ఏచూరికి ఘన నివాళి



మాట్లాడుతున్న బాబుప్రసాద్

తెనాలి రూరల్: సీపీఎం జాతీయ నేత సీతారాం ఏచూరికి నాయకులు ఘన నివాళులర్పించారు. పార్టీ తెనాలి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని కంచర్లపాలెం గ్రామంలో ఆదివారం సాయంత్రం సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. కోపల్లె సురేష్ అధ్యక్షత వహించారు. పార్టీ తెనాలి ఏరియా కమిటీ కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ మాట్లాడుతూ.. ఏచూరి చిన్న వయస్సులోనే మార్క్సిజంపైనా అధ్యయనం చేశారని తెలిపారు. పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహించారని చెప్పారు. సెక్యులరిజం కోసం పలు పార్టీలతో కలిసి విశేష కృషి చేశారని తెలిపారు. ములకా శివసాంబిరెడ్డి , శారద, ప్రభాకర రావు, సీతారామయ్య, శేషగిరిరావు, పి.కృష్ణ, కె.కృష్ణ, జి.నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా యూత్ ఫెస్ట్

తెనాలి అర్బన్: జీసెస్ గాస్పెల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సోమవారం తెనాలిలో మెగా యూత్ ఫెస్ట్‌ను నిర్వహించనున్నట్లు డాక్టర్ ఆర్.జయపాల్ శాస్త్రి తెలిపారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌లను ఆదివారం తెనాలిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఫెస్ట్ కొనసాగుతుందన్నారు. ముఖ్యఅతిథిగా సినీ నటుడు, రాజా ఫెయిత్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ రాజా హెబెల్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.సుధాకర్, కె.కుమార్‌రాజు, ఎం.యాకోబు, పి.దుర్గారావు, ఆర్.ఆనంద్, ఆర్.విక్టర్‌పాల్, ఎస్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జయపాల్ శాస్త్రి, సుధాకర్ తదితరులు

విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి

బాపట్ల: మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో యువ ఇంజినీర్లు ముందుకు సాగాలని రాయగడ్డ కళాశాల ఎన్‌సీసీ అధికారి వాక గాయత్రి పేర్కొన్నారు. బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంత్యుత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థిని, రాయగడ్డ కళాశాల ఎన్‌సీసీ అధికారి వాక గాయత్రి మాట్లాడారు. విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరీ మానం నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ డి. రామ్మోహన్‌రావు, జి.దిలీప్ కుమార్, జాయింట్ సెక్రటరీ కె.హరి పద్మ ప్రసాద్, ట్రెజరర్ టి. రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఐ.హరిత పాల్గొన్నారు.



వాక గాయత్రిని అభినందిస్తున్న ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

బాపట్ల: యువకులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని బాపట్ల ఎంపీ తెన్నేటి కష్ణ ప్రసాద్ తెలిపారు. స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బాపట్ల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన క్రికెట్ పోటీల బహుమతి కార్యక్రమంలో ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెన్నేటి మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. క్రికెట్ అంటే తనకు ఇష్టమని చెప్పారు. బాపట్ల జిల్లా లీగ్ పోటీలను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూ క్రికెట్ అసోసియేషన్ సహాయ సహకారాలు అదిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కొద్దిసేపు ఎంపీ, ఎమ్మెల్యే క్రికెట్ ఆడారు. బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్రీడాకారుడు గంటా అంజిబాబు, అసోసియేషన్ అధ్యక్షులు రఘు, సెక్రెటరీ రామ్మోహన్, సభ్యులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు

అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె రూరల్: ఆర్టీసీ ప్రైవేట్ హైర్ బస్సుల్లో పనిచేసే డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైవర్ల వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. బస్ రిపేర్లు, ప్రమాదాలు జరిగిన సందర్భాలలో డ్రైవర్లకు వేతనంతోపాటు ఖర్చులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో మదర్ థెరిసా హైర్ బస్ యూనియన్ నాయకులు ఎల్.వెంకట్, సుబ్రహ్మణ్యం, భాను, ఇమ్రాన్, సాయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్

హాస్టల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

అమృతలూరు(భట్టిప్రోలు): అమృతలూరు మండలం మోపర్రులోని ఎఆర్‌సీ హాస్టల్ విద్యార్థులకు ఆదివారం నోట్ పుస్తకాలు, పెన్నులు, పౌష్టికాహారం అందచేశారు. అమృతలూరుకు చెందిన ఉపాధ్యాయురాలు చిగురుపాటి శిరోమణి జ్ఞాపకార్థం మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్ ఆర్థిక సహకారంతో వీటిని అందించారు. కార్యక్రమంలో సీపీఎం వేమూరు మండల కార్యదర్శి బొనిగల అగస్టీన్, విశ్రాంత ఉపాధ్యాయులు కొత్తపల్లి మాధవరావు, మల్లిపెద్ది సర్వోజీ, యలవర్రు మాజీ సర్పంచ్ ఇంటూరి విజయభాస్కర్, పరుచూరి శంకర్, నక్కా పార్వతి తదితరులు పాల్గొన్నారు.



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

షార్ట్ సర్క్యూట్‌తో గొడ్లచావిడి దగ్ధం

- రెండు దూడలు మృత్యువాత
- నాలుగు గేదెలకు తీవ్ర గాయాలు

చెరుకుపల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గొడ్లచావిడి దగ్ధమైన ఘటన కూరేటివారిపాలెం గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అచ్యుత సుందరయ్య గొడ్లచావిడిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఫలితంగా చావిడి దగ్ధమైంది. అందులోని రెండు దూడలు మృతి చెందాయి. నాలుగు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి వచ్చి మంటలను అదుపు చేశారు. రూ.1.30 లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్టు రేపల్లె అగ్నిమాపక శాఖ అధికారి సాంబశివరావు తెలిపారు.



కాలిపోయిన గొడ్లచావిడి

వరద బాధితులకు చేయూత



నిత్యావసర సరకులను పంపిణీ చేస్తున్న డాక్టర్ రామ్‌చంద్, ప్రసాద్ తదితరులు



సరుకుల వాహనంతో సంఘ నేతలు

తెనాలి: వరద బాధితులకు ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ మానవతకు చెందిన తెనాలి శాఖ ఆధ్వర్యంలో సాయం చేశారు. పెదలంక, ఆముదలాలంక, గుంటూరు గూడెం, పెసర్లంక గ్రామాలకు చెందిన 350 పేద కుటుంబాలకు ఆదివారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. సుగ్గునలంక, చిలుమూరు లంక, చింతల్లంక గ్రామాల్లోని 450 కుటుంబాలకు దుప్పటి, టవళ్లు అందజేశారు. దుప్పట్లను మానవత సంస్థ ప్రొద్దుటూరు శాఖ సమకూర్చింది. మానవత తెనాలి రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ కటకం ప్రసాద్ (ఓంకార్ ప్రసాద్) పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వర్తించారు. విరాళాలు ఇచ్చిన వారికి ప్రొద్దుటూరు శాఖ చైర్మన్ కళావతి, సభ్యుడు చంద్రశేఖరరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పరిమి వాసు, పి.వెంకట్‌లు సరుకులను పంపిణీ చేశారు. జె.నరసింహారావు, ఎ.ప్రభాకర్, డి సోమయ్య శాస్త్రి, వై.రోహిణి, ఓ ధనలక్ష్మి, మల్లికార్జున రావు, భుజంగరావు, మల్లాది అర్జున, దుర్గాప్రసాద్, ఓ.నాగేశ్వరావు, డాక్టర్ ఆంజనేయులు, అక్కల శ్రీరామ్, ఆలపాటి వెంకట్రామయ్య, ఎ.లక్ష్మీకాంతరావు, కేశవరావు, ఈఎల్‌వీ అప్పారావు, ఎస్‌వీ శర్మ, వీవీ జయరామకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి: వరద బాధిత లంక గ్రామాల ప్రజలకు తమ వంతు సాయం చేసేందుకు ది తెనాలి వెండి, బంగారు నగల వర్తకసంఘం ముందుకొచ్చింది. రూ.2 లక్షల విలువైన నిత్యావసర వస్తువులను 200 కిట్లుగా ప్యాక్ చేయించి, శనివారం కొల్లూరు మండలంలోని చిలుమూరులంక గ్రామస్తులకు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు నేమీచంద్ గోవాణి, కార్యదర్శి వెల్లంపల్లి సత్యనారాయణమూర్తి, చలువాది కిరణ్‌కుమార్, కొత్తమాసు సురేష్‌బాబు, కొత్తమాసు లక్ష్మీనారాయణ, కొల్లూరు హర్ష, కొల్లూరు సత్యనారాయణ, అప్పల మోహన్, పటాన్ల మణి, కొత్తమాసు ఆనంద్, మురికిపూడి సాయి శరత్ పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడికి సత్కారం



నారాయణ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

తెనాలి: వాకర్స్ క్లబ్ (తెనాలి-2) సమావేశం ఆదివారం పట్టణంలోని చెంచుపేటలో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు వేజళ్ల ఉమామహేశ్వర్ అధ్యక్షత వహించారు. క్లబ్ స్థాపించి ఇరవై ఏళ్ల పూర్తయిన సందర్భంగా వ్యవస్థాపకుడు, సంస్థ ఉపాధ్యక్షుడు వైఎల్ నారాయణను సతీసమేతంగా ఘనంగా సత్కరించారు. క్లబ్ అభివృద్ధికి వారు చేసిన కృషిని, కెప్టెన్ విజయప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో అందించిన సేవలను ప్రశంసించారు. మాజీ అధ్యక్షులు వీడీఆర్ మనోహర్, పి.రాజారావు సేవలను స్మరించుకున్నారు. వారి బాటలోనే వాకర్స్ క్లబ్‌ను నడిపిస్తూ సమాజ సేవకు అంకిత భావంతో పని చేస్తామని వేజళ్ల ఉమామహేశ్వర్ అన్నారు. కార్యవర్గ సభ్యులు జి. మురహరిరావు, ఆర్. ఆనందరావు, భుజంగరావు, మందలపు వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ మహాపురుషులు

వేమూరు(అమర్తలూరు): బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ మహాపురుషులని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చెప్పారు. అమర్తలూరులోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆనందబాబు, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. నక్కా ఆనంద బాబు మాట్లాడుతూ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ మాట్లాడూ జగ్జీవన్ రామ్ రాజకీయ మేధావి అని కీర్తించారు. కార్యక్రమంలో బాబు జగ్జీవన్ రామ్ యూత్, తెలుగు దేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

225 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

కర్లపాలెం: పౌష్టికాహారం తీసుకోవటం ద్వారా కంటిచూపును మెరుగు పరుచుకోవచ్చునని డాక్టర్లు అరుణ్‌చంద్ర, బిపిన్ పాల్, మరియ తెలిపారు. కర్లపాలెంలోని పెద్దింటమ్మ కల్యాణ మండపంలో ఆదివారం సింగరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పెనుమత్స కృష్ణంరాజు, కార్యదర్శి సత్యనారాయణరాజుల ఆర్థిక సహకారంతో పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 225మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 146 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి గ్రామీణ సేవా సమితి జిల్లా కో-ఆర్డినేటర్ టి.శ్రీనివాసరావు, సమితి సభ్యులు వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, సుబ్బారావు, పెదగొల్లపాలెం మాజీ సర్పంచ్ బొమ్మనబోయిన సాంబయ్య తదితరులు ఉన్నారు.

రేపు ఉచిత న్యూరాలజీ మెడికల్ క్యాంప్

బాపట్లటౌన్: బాపట్ల ఏరియా వైద్యశాలలో ఈనెల 17న మంగళవారం అమెరికాలోని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ తేజానంద్ గౌతమ్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ జరుగుతుందని ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ తెలిపారు. మూర్ఛ వ్యాధి, పక్షవాతం , నరాల బలహీనత, కండరాల నొప్పులకు సంబంధించి వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు మెడికల్ క్యాంప్ జరుగుతుందని వివరించారు.

ఏలేటిపాలెంలో పేకాట శిబిరంపై దాడులు

నగరం: పేకాట శిబిరాలపై నగరం పోలీసులు దాడులు నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని ఏలేటిపాలెం సపోటాతోటలలో జరిగింది. నగరం ఎస్ఐ భార్గవ్ కథనం ప్రకారం.. ఏలేటిపాలెం సపోటా తోటలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేపట్టినట్లు తెలిపారు. ఈదాడులలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ16,150 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

అక్రమ మద్యం కేసులో మహిళ అరెస్ట్

బాపట్లటౌన్: అక్రమ మద్యం కేసులో మహిళను అరెస్ట్ చేసిన ఘటన మండలంలోని జమ్ములపాలెం గ్రామంలో జరిగింది. జమ్ములపాలెం గ్రామానికి చెందిన గుడిపల్లి రాగమ్మ మద్యం విక్రయిస్తుండగా ఆదివారం పోలీసులు దాడులు చేశారు. ఆమె వద్ద నుంచి 17 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ గంగాధరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

17 నుంచి పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్



తెనాలి అర్బన్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వచ్చే మంగళవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు పట్టణంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదివారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే ఈ డ్రైవ్‌లో వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. ప్రజలకు పారిశుద్ధ్య కార్యక్రమాలపై అవగాహన, వార్డులలోని కాల్వలు శుభ్రం చేయడం, తీసిన వ్యర్థాల తొలగింపు, రోడ్ల మరమ్మతులు, ఖాళీ స్థలాల్లో చెత్త తొలగింపు, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల మందు పిచికారి, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేయడం వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం వార్డులవారీగా ఫాగింగ్, రోడ్లపై ఉన్న భవన నిర్మాణ సామగ్రి తొలగించుట వంటివి చేయనున్నట్లు వివరించారు. ఉద్యోగులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

లంక గ్రామాల్లో విష సర్పాల సంచారం

భట్టిప్రోలు: లంక గ్రామాల్లో విష సర్పాలు సంచరిస్తున్నాయి. భట్టిప్రోలు మండలం పెదలంక మధ్యగూడెంలో ఆదివారం ఆరు అడుగుల గుమ్మడి విత్తుల పింజేరి పాము రహదారిపై నుంచి ఓ ఇంట్లోకి చొరబడుతుండగా స్థానికులు చూసి కర్రలతో చంపేశారు.